50 సూచీల్లో అట్టడుగున భారత్

బీజేపీ పాలనలో దుర్భరస్థితిలోకి దేశం

ఆర్థిక, సామాజిక, ఆరోగ్య, ఆకలి, భద్రత, పారిశ్రామిక రంగాల్లో దేశం అధోగతి

ద్రవ్యోల్బణం, నిరుద్యోగిత, ఉత్పాదకత పౌర స్వేచ్ఛ సూచీల్లో అధఃపాతాళం

కుండబద్దలు కొట్టిన చాట్‌బాట్ 'గ్రోక్'

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఏప్రిల్ 11 (నమస్తే తెలంగాణ): పదకొండేండ్ల బీజేపీ ప్రభుత్వం వైఫల్యాల పుట్ట బద్దలైంది. దేశ ప్రగతికి కీలకంగా పరిగణించే ప్రధాన సూచీలు, అంశాల్లో ప్రపంచ దేశాల ముందు భారత్ దిగజారిపోయినట్టు తేటతెల్లమైంది. అయితే, అసలు వాస్తవాలను కప్పిపుచ్చి.. తమ పాలనలో దేశం దేదీప్యమానంగా వెలుగుతున్నట్టు బీజేపీ నేతలు చేసుకొంటున్న ప్రచారాన్ని ఏఐ చాట్‌బాట్ 'గ్రోక్' కుండబద్దలు కొట్టి మరీ తప్పని రుజువు చేసింది. 'పైన పటారం.. లోన లొటారం' అన్నట్టు బీజేపీ ప్రభుత్వ పాలనంతా డంబాచారంగానే నడుస్తున్నట్టు తేల్చి చెప్పింది. దేశప్రగతికి కీలకమైన ఆర్థిక, సామాజిక, విద్య, వైద్యం, పారిశ్రామిక తదితర రంగాల్లో.. ద్రవ్యోల్బణం, నిరుద్యోగిత, ఉత్పాదకత, పౌర స్వేచ్ఛ వంటి 50కి పైగా సూచీల్లో మోదీ హయాంలో ఇండియా అట్టడుగు స్థానంలో నిలిచినట్టు 'గ్రోక్' ర్యాంకులతో సహా వెల్లడించింది.



'గ్రోక్' ప్రకారం.. ప్రధాన సూచీల్లో భారత్ ర్యాంకులు ఇలా..

■ సురక్షిత దేశం
- 2014లో ర్యాంకు: 65
- ప్రస్తుత ర్యాంకు: 66 (ఎక్కువ ర్యాంకు ప్రతికూలతకు సంకేతం)

వివరణ: నేరాలు, దాడులు, మత కల్లోలాలు, ఘర్షణలను ఆధారంగా చేసుకొని సురక్షిత దేశం ఏమిటన్న దానిపై ర్యాంకులను ప్రకటిస్తారు. సురక్షిత దేశాల్లో భారత్ కంటే పాకిస్థాన్ ఒక స్థానం మెరుగ్గా ఉండటం గమనార్హం.

■ లింగ సమానత్వం
- 2014లో ర్యాంకు: 114
- ప్రస్తుత ర్యాంకు: 129 (ఎక్కువ ర్యాంకు ప్రతికూలతకు సంకేతం)

వివరణ: సమ్మిళిత అభివృద్ధికి దిక్సూచీగా పిలిచే లింగసమానత్వ సూచీలోనూ భారత్ అంతకంతకూ దిగజారుతున్నది. 2014లో 114వ ర్యాంకు నమోదు చేసిన దేశం.. ప్రస్తుతం 129వ స్థానానికి పరిమితమైంది.

■ పత్రికా స్వేచ్ఛ
- 2014లో ర్యాంకు: 140
- ప్రస్తుత ర్యాంకు: 159 (ఎక్కువ ర్యాంకు ప్రతికూలతకు సంకేతం)

వివరణ: దేశంలోని మీడియా సంస్థలపై బీజేపీ సర్కారు నియంత్రణ ఎక్కువైందన్న వాదనలు ఉన్నాయి. దీన్ని నిరూపిస్తూ.. 2014లో పత్రికా స్వేచ్ఛ సూచీలో 140వ స్థానంలో ఉన్న భారత్.. 159కు దిగజారింది.

■ ఆకలి సూచీ
- 2014లో ర్యాంకు: 55
- ప్రస్తుత ర్యాంకు: 105 (ఎక్కువ ర్యాంకు ప్రతికూలతకు సంకేతం)

వివరణ: సూడాన్, రువాండా, కాంగో వంటి అతి పేద దేశాలకంటే ఆకలి సూచీలో భారత్ అట్టడుగు స్థానంలో నిలిచింది. 11 ఏండ్ల బీజేపీపాలనలో ఆకలిసూచీలో భారత్ ర్యాంక్ 50 స్థానాలు పతనమయ్యాయి.

■ అవినీతి
- 2014లో ర్యాంకు: 85
- ప్రస్తుత ర్యాంకు: 96 (ఎక్కువ ర్యాంకు ప్రతికూలతకు సంకేతం)

వివరణ: విదేశీ బ్యాంకుల్లో మూలుగుతున్న నల్లధనాన్ని వెనక్కి తీసుకొస్తామని, అవినీతిని నిర్మూలిస్తామంటూ అధికారంలోకి వచ్చిన బీజేపీ సర్కారు ఆ దిశగా తీసుకొన్న చర్యలు శూన్యం. ఫలితంగా.. గడిచిన పదకొండేండ్లలో అవినీతి సూచీలో భారత్ స్థానం మరింతగా పడిపోయింది.

■ పౌరుల వ్యక్తిగత పొదుపు
- 2014లో ర్యాంకు: 20
- ప్రస్తుత ర్యాంకు: 35 (ఎక్కువ ర్యాంకు ప్రతికూలతకు సంకేతం)

వివరణ: ద్రవ్యోల్బణం, నిరుద్యోగిత కారణంగా గడిచిన 30 ఏండ్లలో ఎన్నడూచూడని రీతిన పౌరుల పొదుపు ఖాతాలు ఖాళీ అయినట్టు మోతీలాల్ ఓస్వాల్ సెక్యూరిటీస్ నివేదికలో ఇటీవలే వెల్లడైంది.

■ పౌరస్వేచ్ఛ సూచీ
- 2014లో ర్యాంకు: 27
- ప్రస్తుత ర్యాంకు: 47 (ఎక్కువ ర్యాంకు ప్రతికూలతకు సంకేతం)

వివరణ: బీజేపీప్రభుత్వ హయాంలో పౌర హక్కుల ఉల్లంఘనలు పెరిగిపోయాయని ఆమ్నెస్టీ వంటి అంతర్జాతీయ సంస్థలు ఇప్పటికే పలుమార్లు ఆందోళన వ్యక్తం చేశాయి. దీన్ని ధ్రువపరుస్తూ 2014లో పౌర స్వేచ్ఛ సూచీలో 27వ ర్యాంకు సాధించిన భారత్.. ప్రస్తుతం 47కి పడిపోయింది.

■ ఆనందమయ దేశాలు
- 2014లో ర్యాంకు: 111
- ప్రస్తుత ర్యాంకు: 118 (ఎక్కువ ర్యాంకు ప్రతికూలతకు సంకేతం)

వివరణ: సామాజిక భద్రత, ఆరోగ్యం, ఆదాయం, స్వేచ్ఛ, అవినీతి వంటి సూచీలను ఆధారంగా చేసుకొని వరల్డ్ హ్యాపినెస్ ఇండెక్స్‌ను ఏటా ప్రకటిస్తారు. 2014లో 111వ స్థానంలోస్థానంలో ఉన్న భారత్.. ఇప్పుడు 118వ స్థానానికి పరిమితమైంది.

■ శక్తిమంతమైన పాస్‌పోర్ట్
- 2014లో ర్యాంకు: 76
- ప్రస్తుత ర్యాంకు: 85 (ఎక్కువ ర్యాంకు ప్రతికూలతకు సంకేతం)

వివరణ: వీసా అవసరం లేకుండా ఏ దేశానికైనా వెళ్లగలిగే అవకాశం కలిగిఉన్న పాస్‌పోర్ట్‌ను అత్యంత శక్తిమంతమైనదిగా భావిస్తారు. అవినీతి, నేరాలు, సంక్షోభాలు తక్కువగా ఉన్న దేశాలు ఈ సూచీలో మెరుగ్గా ఉంటాయి. గ్రోక్ వివరాల ప్రకారం.. హెన్లే శక్తిమంతమైన పాస్‌పోర్ట్ సూచీలో జపాన్, సింగపూర్ టాప్ ప్లేస్‌లో ఉండగా భారత్ 85వ స్థానంలో ఉన్నది.

■ సామాజిక సంక్షేమం
- 2014లో ర్యాంకు: 102
- ప్రస్తుత ర్యాంకు: 108 (ఎక్కువ ర్యాంకు ప్రతికూలతకు సంకేతం)

వివరణ: సమాజంలోని అన్నివర్గాల అభ్యున్నతి, సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకొనే పథకాలు, నిర్ణయాలను బట్టి సామాజిక సంక్షేమం ఆధారపడి ఉంటుంది. భారత్‌వంటి జనాభా ఎక్కువ గల దేశం.. సామాజిక సంక్షేమ సూచీలో మెరుగ్గాలేకపోవడం అందోళన కలిగిస్తున్నది.

■ పర్యావరణ సూచీ
- 2014లో ర్యాంకు: 155
- ప్రస్తుత ర్యాంకు: 176 (ఎక్కువ ర్యాంకు ప్రతికూలతకు సంకేతం)

వివరణ: ప్రకృతి సమతౌల్యాన్ని దెబ్బతీసే చర్యలను కట్టడి చేసే దేశాల జాబితాలోనూ భారత్ పేలవమైన ప్రదర్శన చూయించింది. బీజేపీ హయాంలో పర్యావరణ విధ్వంసం పెరిగిపోయింది. 11 ఏండ్లలోనే ఈ సూచీలో భారత్ 21 స్థానాలు దిగజారింది. 176వ ర్యాంకుకు పడిపోయింది.

■ పింఛన్ సూచీ
- 2014లో ర్యాంకు: 24
- ప్రస్తుత ర్యాంకు: 44 (ఎక్కువ ర్యాంకు ప్రతికూలతకు సంకేతం)

వివరణ: పనిచేసే సామర్థ్యంలేని వయోధికులకు, రిటైరైన ఉద్యోగులకు ఆర్థిక సాయాన్ని అందించే పింఛన్ సూచీలో భారత్ 44వ స్థానంలో నిలిచింది. 48 దేశాలకు ఇచ్చిన ర్యాంకుల్లో భారత్ 44వ స్థానానికి పరిమితమవ్వడం అందోళనకరం.

దయనీయ సూచీ
- 2014లో ర్యాంకు: 80
- ప్రస్తుత ర్యాంకు: 103 (ఎక్కువ ర్యాంకు ప్రతికూలతకు సంకేతం)

వివరణ: దుర్భరమైన పరిస్థితులను ఎదుర్కొంటున్న 157 దేశాల్లో ఇండియా 103వ ర్యాంక్ సాధించింది. పొరుగున ఉన్న బంగ్లాదేశ్ సహా మొత్తం 102 దేశాలు ఈ సూచీలో భారత్ కంటే ఎంతో మెరుగ్గా ఉన్నాయి.

■ ఎగుమతుల సూచీ
- 2014లో ర్యాంకు: 14
- ప్రస్తుత ర్యాంకు: 17 (ఎక్కువ ర్యాంకు ప్రతికూలతకు సంకేతం)

వివరణ: ఏదైనా దేశం ఆర్థికంగా బలోపేతంగా ఉండాలంటే ఎగుమతులు ఎక్కువగా ఉండాలి. చైనా ఒక ఏడాదిలో చేసే ఎగుమతుల విలువ.. మన దేశం పదేండ్ల ఎగుమతులకు సమానం

■ ఎఫ్‌డీఐ
- 2014లో ర్యాంకు: 6
- ప్రస్తుత ర్యాంకు: 15 (ఎక్కువ ర్యాంకు ప్రతికూలతకు సంకేతం)

వివరణ: 2022-23 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే, గత ఏడాది విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) 17 % మేర పడిపోయాయి. పదేండ్లలో ఇదే కనిష్ఠం.

■ మానవాభివృద్ధి
- 2014లో ర్యాంకు: 130
- ప్రస్తుత ర్యాంకు: 134 (ఎక్కువ ర్యాంకు ప్రతికూలతకు సంకేతం)

వివరణ: మానవ వికాసం, నైపుణ్యాలను పెంపొందించే దిశగా ప్రభుత్వాలు తీసుకొంటున్న చర్యలను బట్టి ఇచ్చే మానవాభివృద్ధి సూచీలో భారత్ 134వ ర్యాంకుకు పరిమితమైంది. భారత్‌తో సమానమైన జనాభా ఉన్న చైనా ఈ విషయంలో ఎంతో మెరుగ్గా ఉంది.

■ నిరుద్యోగిత
- 2014లో ర్యాంకు: 83
- ప్రస్తుత ర్యాంకు: 90 (ఎక్కువ ర్యాంకు ప్రతికూలతకు సంకేతం)

వివరణ: పనిచేయగల సామర్థ్యం, ఉత్సాహం ఉన్నప్పటికీ, తగినన్ని ఉద్యోగాలు లేకపోవడమే నిరుద్యోగిత. దేశంలో పనిచేయగల సామర్థ్యం ఉన్న దాదాపు 22 కోట్ల మందికి ఇప్పటికీ తగిన ఉద్యోగాలు లభించలేదు.

■ ప్రజాస్వామ్యం
- 2014లో ర్యాంకు: 27
- ప్రస్తుత ర్యాంకు: 47 (ఎక్కువ ర్యాంకు ప్రతికూలతకు సంకేతం)

వివరణ: భారత్‌లో ప్రజాస్వామ్యానికి విఘాతం ఏర్పడుతున్నట్టు ఇప్పటికే పలు స్వచ్ఛంద నివేదికలు హెచ్చరించాయి. ప్రజాస్వామ్య సూచీలో ప్రస్తుతం భారత్ ర్యాంకు 47. పదకొండేండ్ల కిందట ఇది 27గా ఉండేది.

■ ఆరోగ్యం, మనుగడ సూచీ
- 2014లో ర్యాంకు: 114
- ప్రస్తుత ర్యాంకు: 142 (ఎక్కువ ర్యాంకు ప్రతికూలతకు సంకేతం)

వివరణ: ఆరోగ్యం, మనుగడకు అవసరమైన సదుపాయాల విషయంలో భారత్ ఎంతో వెనుకబడి ఉన్నది. హెల్త్ అండ్ సర్వైవల్ ఇండెక్స్‌లో 2014లో 114వ ర్యాంకులో ఉన్న ఇండియా.. ప్రస్తుతం 28 స్థానాలు తగ్గి 142వ ర్యాంకులో స్థిరపడింది.

■ ద్రవ్యోల్బణం
- 2014లో ర్యాంకు: 40
- ప్రస్తుత ర్యాంకు: 65 (ఎక్కువ ర్యాంకు ప్రతికూలతకు సంకేతం)

వివరణ: దేశంలో ఎన్నడూ చూడనంతగా ద్రవ్యోల్బణం కట్టలుతెంచుకొంటున్నది. పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. అందుకే ఈ సూచీలో భారత్ అట్టడుగున ఉన్నది.

■ జనాభా-ఉత్పాదకత
- 2014లో ర్యాంకు: 101
- ప్రస్తుత ర్యాంకు: 127 (ఎక్కువ ర్యాంకు ప్రతికూలతకు సంకేతం)

వివరణ: ప్రపంచంలోనే అత్యంత ఎక్కువ జనాభా కలిగిన భారత్‌లో.. ఉత్పాదకత రేటు అత్యంత తక్కువగా ఉన్నది. నిరుద్యోగం, పారిశ్రామిక, వ్యాపార రంగాలకు ప్రభుత్వం తోడ్పాటునివ్వకపోవడమే దీనికి కారణం.

■ కరెన్సీ పతనం
- 2014లో ర్యాంకు: 110
- ప్రస్తుత ర్యాంకు: 135 (ఎక్కువ ర్యాంకు ప్రతికూలతకు సంకేతం)

వివరణ: అమెరికన్ డాలర్‌ను అంతర్జాతీయంగా ప్రామాణిక కరెన్సీగా పరిగణిస్తారు. ఒక కువైట్ దినార్‌కు 3.24 అమెరికన్ డాలర్లు వస్తే, ఒక అమెరికన్ డాలర్‌ను కొనుగోలు చేయాలంటే, 86 రూపాయలను ఖర్చు చేయాల్సి ఉంటుంది. చరిత్రలో అత్యంత కనిష్ఠ స్థాయికి రూపీ విలువ పడిపోవడం నిత్యకృత్యంగా మారింది.

■ వినియోగదారుల ధరల సూచీ
- 2014లో ర్యాంకు: 40
- ప్రస్తుత ర్యాంకు: 60 (ఎక్కువ ర్యాంకు ప్రతికూలతకు సంకేతం)

వివరణ: గడిచిన 11 ఏండ్లలో నిత్యావసర వస్తువుల ధరలు దేశంలో దాదాపుగా 350 శాతం వరకు పెరిగాయి.

■ ఇంటర్నెట్ షట్‌డౌన్
- 2014లో ర్యాంకు: 3
- ప్రస్తుత ర్యాంకు: 1 (తక్కువ ర్యాంకు ప్రతికూలతకు సంకేతం)

వివరణ: ప్రపంచవ్యాప్తంగా ఏడాదిలో జరిగే మొత్తం ఇంటర్నెట్ షట్‌డౌన్‌లలో భారత్ వాటా 56 శాతం.

ఈ సూచీల్లోనూ నేలచూపులే..

దేశ ఆర్థికాభివృద్ధికి కీలకమైన విద్యుదుత్పత్తి, జీడీపీ వృద్ధిరేటు, జీడీపీ మొత్తం విలువ, క్రెడిట్ రేటింగ్, గోల్డ్ రిజర్వ్, కరెంట్ అకౌంట్, వడ్డీరేట్లు, జనాభా-బడ్జెట్ వ్యాల్యూ, రాబడి-వ్యయం, జీడీపీలో పారిశ్రామికరంగం వాటా, జీడీపీలో తయారీరంగం వాటా, జీడీపీలో నిర్మాణరంగం వాటా, జీడీపీలో మైనింగ్ వాటా, జీడీపీలో సేవలు, జీడీపీలో అడ్మిన్ సర్వీసెస్, దిగుమతుల సూచీ, హోమ్ ఓనర్‌షిప్ రేట్, బ్యాంకుల్లో క్యాష్ రిజర్వ్‌లు, బిజినెస్ కాన్ఫిడెన్స్ సూచీ, సమ్మిళిత వృద్ధి, వైద్య సేవలు తదితర కీలకాంశాల్లో భారత్ అట్టడుగు స్థానాల్లో (60 నుంచి 100 ర్యాంకుల మధ్య) ఉన్నట్టు 'గ్రోక్' చాట్‌బాట్ పేర్కొంది. వరల్డ్ కాంపిటీటివ్ ర్యాంకింగ్స్, జీవన ప్రమాణాల సూచీ, పారదర్శక పాలన, చట్టబద్ధ పాలన, పరివర్తన సూచీలో భారత్ మిగతా దేశాలతో పోలిస్తే ఎంతో వెనుకంజలో ఉన్నట్టు 'గ్రోక్' వివరించింది.

సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం రామన్నగూడెం తండా ఐకేపీ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న రైతులు, బీఆర్ఎస్ నాయకులు

ధాన్యం కాంటాలు ప్రారంభించాలని నిరసన

- **రామన్నగూడెంలో రైతుల ఆందోళన**

తుంగతుర్తి, ఏప్రిల్ 11 : అకాల వర్షాల వల్ల కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిపోతున్నదని, వెంటనే కాంటాలు వేయాలని సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం రామన్నగూడెం తండా ఐకేపీ కొనుగోలు కేంద్రంలో శుక్రవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులు నిరసనకు దిగారు. వర్షానికి ధాన్యం తడిసి తీవ్రంగా నష్టపోతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు లేకుండా వెంటనే కొనుగోళ్లు చేపట్టాలని, తడిసిన ధాన్యాన్ని సైతం ప్రభుత్వం, మిల్లర్లు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ధాన్యం కాంటాలో నిర్లక్ష్యంపై ఫైర్

లక్ష్మాపూర్ సొసైటీ ఎదుట రైతుల నిరసన

చందూర్, ఏప్రిల్ 11: కావాల్సిన వారి వడ్లు మాత్రమే కాంటా వేసి, మిగతా వారిని పట్టించుకోవడం లేదంటూ రైతులు ఆందోళనకు దిగారు. నిజామాబాద్ జిల్లా చందూర్ మండలంలోని మేడ్‌పల్లి, కారేగాం, లక్ష్మాపూర్ గ్రామాలకు చెందిన రైతులు లక్ష్మాపూర్ సొసైటీకి ధాన్యం తీసుకొచ్చారు. పంట కోసి రోజులు గడుస్తున్నా కాంటాలు వేయడం లేదని, కావాల్సిన వారికి వెంటవెంటనే కాంటాలు వేస్తున్నారంటూ శుక్రవారం సొసైటీ ఎదుట బైఠాయించారు. అకాల వర్షాల నుంచి ధాన్యాన్ని కాపాడుకోవడానికి ఇబ్బంది పడుతున్నామని, వెంటనే తమ వడ్లు కాంటా వేయాలని డిమాండ్ చేశారు. సొసైటీ చైర్మన్ అశోక్ నిర్వాహకుల పక్షాన రైతులకు క్షమాపణ చెప్పారు. మరోసారి ఇలా జరగకుండా చూస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.

లక్ష్మాపూర్ సొసైటీ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు

నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం పిట్టలగూడెంలో నేలకొరిగిన బొప్పాయి పంటను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారి మురళి

అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలు

తీవ్రంగా నష్టపోయిన రైతులు

నమస్తేతెలంగాణ న్యూస్‌నెట్‌వర్క్, ఏప్రిల్ 11 : రాష్ట్రంలోని పలు జిల్లాల్లో గురువారం రాత్రి ఈదురు గాలులతో కురిసిన వర్షానికి పంటలకు నష్టం వాటిల్లింది. జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం శేషంపల్లి, విఠలాపురం గ్రామాల్లో బొప్పాయి, మామిడి తోటలు దెబ్బతిన్నాయి. శేషంపల్లిలో రైతు రమేశ్‌కు చెందిన 4ఎకరాల బొప్పాయి తోటలో దాదాపు 500 చెట్లు నేలకొరగడంతోపాటు కాయలన్నీ కూడా నేలరాలాయి. అదేవిధంగా మామిడి తోటలో కాయలు రాలిపోయాయని, ప్రస్తుతం మామిడి తోట కాపు చాలా తక్కువగా ఉందని, ఈదురు గాలులతో ఉన్న మామిడి కాయలు రాలిపోయి రూ. లక్షల్లో నష్టం వాటిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా మానవపాడు మండలంలో కల్లాల్లో ఆర బోసుకున్న మిరప తడిసింది. నల్లగొండ జిల్లాలోని గుర్రంపోడు, పెద్దవూర, గుడిపల్లితోపాటు పలు మండలాల్లో పంటలు దెబ్బతిన్నాయి. వరితోపాటు మామిడి, జొన్న, ఉద్యానం పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది.

తెలంగాణ రైతు మహోత్సవం ప్రారంభం

స్టాళ్లను సందర్శించిన మండలి చైర్మన్ గుత్తా

హైదరాబాద్, ఏప్రిల్ 11 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ అగ్రి, హార్టికల్చర్ సొసైటీ ఆధ్వరంలో నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో తెలంగాణ రైతు మహోత్సవం-2025 కార్యక్రమాన్ని శుక్రవారం శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ నెల 14 వరకు జరిగే ఈ ప్రదర్శనలో పలు వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల ఉత్పత్తులు, పరికరాలను అందుబాటులో ఉంచారు. కార్యక్రమంలో భాగంగా అన్ని స్టాళ్లను మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డితో పాటు రైతు కమిషన్ చైర్మన్, సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా పౌల్ట్రీ రంగంలో ఆధునిక పద్ధతులు, పౌల్ట్రీ ఇండియా నిర్వహిస్తున్న కార్యక్రమాలను గుత్తా ప్రశంసించారు. పౌల్ట్రీ ఇండియా, ఇండియన్ పౌల్ట్రీ ఎక్యూప్‌మెంట్ మ్యానుఫాక్చర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఉదయ్‌సింగ్ బయాస్ మాట్లాడుతూ.. వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ సంస్థలను ఒకే వేదికకిందికి తీసుకొచ్చేందుకు ఇలాంటి వేదికలు దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, ఎమ్మెల్యే పర్ణికరెడ్డి, కమిషన్ సభ్యులు కేవీఎన్ రెడ్డి, గోపాల్‌రెడ్డి, భూమి సునీల్, భవానీరెడ్డి, పౌల్ట్రీ ఇండియా ప్రతినిధులు రాధిక, లత పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లిస్తాం

మంత్రుల బృందం వెల్లడి

చిన్నకోడూరు, ఏప్రిల్ 11: అకాల వర్షాలతో నష్టపోయిన ప్రతి రైతుకూ నష్టపరిహారం చెల్లిస్తామని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం ఇబ్రహీంనగర్‌లో వడగండ్ల వానకు దెబ్బతిన్న పంటలను మంత్రుల బృందం శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించింది. తమకు జరిగిన పంట నష్టం వివరాలను రైతులు మంత్రుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. మూడు రోజులుగా కురిసిన అకాల వర్షం, రాళ్ల వాన మూలంగా రైతులకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. నష్టపోయిన రైతులను ఆదుకోవాల్సిందిగా క్యాబినేట్ నిర్ణయం తీసుకుందని చెప్పారు.రాష్ట్ర వ్యాప్తంగా 24 వేల ఎకరాల్లో నష్టం జరిగినట్టు ప్రాథమికంగా గుర్తించినట్టు తెలిపారు.



సిద్దిపేట జిల్లా ఇబ్రహీంనగర్‌లో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్

టిమ్స్ పనుల్లో ఆలస్యంపై మంత్రి అసంతృప్తి

హైదరాబాద్, ఏప్రిల్ 11 (నమస్తే తెలంగాణ): నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీలు, కొత్తపేట, సనత్‌నగర్, అల్వాల్ సూపర్ స్పెషాలిటీ దవాఖానలు (టిమ్స్), వరంగల్ హెల్త్‌సిటీ భవన నిర్మాణ పనుల పురోగతిపై వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయా నిర్మాణ పనులు ఆలస్యం అవుతుండటంపై మంత్రి దామోదర అసంతృప్తి వ్యక్తంచేశారు. వర్షకాలం మొదలయ్యేలోగా నిర్మాణ పనులన్నీ కొలిక్కి రావాలని అధికారులను ఆదేశించారు.

మరో మూడు రోజులు మోస్తరు వర్షాలు

- **బలహీనపడిన అల్పపీడనం : వాతావరణ కేంద్రం వెల్లడి**

హైదరాబాద్, ఏప్రిల్ 11 (నమస్తేతెలంగాణ): పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన అల్పపీడనం శుక్రవారం బలహీనపడిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. దీంతో రాష్ట్రంలో మూడు రోజులు పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారి శ్రీనివాస్‌రావు తెలిపారు. దీంతో పాటు పిడుగులు పడే అవకాశముంటుందని చెప్పారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాబోయే మూడు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణంగా కొనసాగుతాయని వివరించారు. తెలంగాణకు ఆనుకొని ద్రోణి ఏర్పడిందని, ఉపరితల అవర్తనం కారణంగా రాష్ట్రంలో తేమ గాలులు వీస్తున్నాయని తెలిపారు.